క్లుప్తంగా

బాధితుడికి రూ.25 వేల ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

కోదాడ : పట్టణ పరిధిలోని తమ్మరకు చెందిన అప్పన రామారావు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డాడు. బాధితుడి కుటుంబానికి గురువారం సూర్యాపేట జిల్లా ఆర్య వైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో రూ.25 వేల ఆర్థికసాయం, 25 కేజీల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. తమ సంఘం బాధితులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలు గరిణే ఉమామహేశ్వరి, ప్రధాన కార్యదర్శి ఓరుగంటి విజయలక్ష్మి, కోదాడ వాసవీ క్లబ్ అధ్యక్షుడు శేకు శ్రీనివాసరావు, చెన్నకేశవరావు, హైమావతి, స్వాతి, సుప్రియ, అనిల్‌కుమార్, ఓరుగంటి పాండు తదితరులు పాల్గొన్నారు.

సైదులుకు అండగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు


సైదులుకు ఆర్థికసాయం అందజేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

కోదాడరూరల్ : మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన బాలెబోయిన సైదులు కోదాడ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల వాచ్‌మెన్‌గా పనిచేస్తుండడంతో పాటు వాకర్స్ సభ్యుడిగా కూడా ఉన్నాడు. ఇటీవల సైదులు తల్లి గోవిందమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో గురువారం గ్రామంలో జరిగిన దశదినకర్మ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రూ.11వేలను అతనికి అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు ఉన్నారు.

మహిళ కడుపులో నుంచి కణితి తొలగింపు

హుజూర్‌నగర్ : శస్త్ర చికిత్స చేసి వైద్యులు ఓ మహిళ కడుపులో నుంచి కణితిని తొలగించారు. వైద్యుల కథనం ప్రకారం.. గరిడేపల్లి మండలం తాళ్లమల్కాపురం గ్రామానికి చెందిన మహిళ గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. దీంతో హుజూర్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా వైద్యులు ఆమెకు గురువారం శస్త్రచికిత్స చేసి ఆమె కడుపులోని అండాశయం వద్ద 7 కిలోల కణితిని తొలగించారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటుందని వైద్యులు తెలిపారు.

నాణ్యత లోపంతో సీసీరోడ్డుకు పగుళ్లు


రోడ్డుపై పగుళ్లను పరిశీలిస్తున్న గ్రామస్తులు

మునగాల : మండల కేంద్రంలోని తులిశమ్మ వీధిలో ఇటీవల సీసీ రోడ్డును నాణ్యత లోపంతో నిర్మించడంతో అనతి కాలంలోనే పగుళ్లు ఏర్పడ్డాయని స్థానికులు ఆరోపించారు. గురువారం రోడ్డును వారు పరిశీలించి మాట్లాడారు. రోడ్డుపై పగుళ్లతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణంలో ఇసుక వినియోగించకుండా డస్ట్ వాడారని ఆరోపించారు. ఈ విషయాన్ని పంచాయతీరాజ్ శాఖ ఏఈ దృష్టికి తీసుకెళ్లగా సీసీ రోడ్డు నిర్మించిన విషయమే తనకు తెలియదని అన్నట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించాలని, సీసీ రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్ నాణ్యత పాటించేలా చూడాలని కోరారు.

ముత్తయ్య మృతి బాధాకరం

మోతె : మండలంలోని రావిపహాడ్ గ్రామంలో బీఆర్ఎస్ యువ నాయకుడు చాట్ల మధు బాబు తండ్రి చాట్ల ముత్తయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ముత్తయ్య మృతదేహాన్ని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శీలం సైదులు, జిల్లా నాయకులు ఏలూరి వెంకటేశ్వరరావు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముత్తయ్య మృతి బాధాకరమని వారు అన్నారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ నాయకులు మిక్కిలినేని సతీష్‌బాబు, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు ఎస్‌కె జానీపాష, పాడపంగి వేణు, కోటేష్, కోడి లింగయ్య, కుక్కడపు భిక్షం, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోదాడరూరల్ : మండలంలోని రెడ్లకుంటలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించేందుకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ రూరల్ ఏఈ ఎస్‌కె.సైదా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరిశ్రమల నిర్వాహకులు, గృహ వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

పాడి రైతులకు బాసటగా

- గరిడేపల్లి మండలానికి 158 పశువుల షెడ్లు మంజూరు
- 40 పాకల నిర్మాణాలు పూర్తి
- ఒక్కో షెడ్డుకు రూ.83 వేలు


గరిడేపల్లిలో పాడి రైతు నిర్మించుకున్న పశువుల షెడ్డు

గరిడేపల్లి : పాడి రైతులకు ప్రభుత్వం బాసటగా నిలుస్తోంది. ఐదు ఎకరాలలోపు వ్యవసాయ భూములు ఉండి ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉన్న సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం పశువుల కొట్టాలు మంజూరు చేసింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నూరు శాతం సబ్సిడీతో పశువుల కొట్టాలు మంజూరు చేసింది. ఇందులో భాగంగా గరిడేపల్లి మండలానికి 158 పశువుల షెడ్లు మంజూరయ్యాయి. అందులో ఇప్పటికే 40 పశువుల షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా పశువుల షెడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. మండలంలోని 32 గ్రామ పంచాయతీల పరిధిలో గత మూడు నెలలుగా షెడ్ల నిర్మాణ పనులు సాగుతున్నాయి.

ఒక్కో షెడ్డుకు రూ.83 వేలు..

కాగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పశువుల షెడ్డు నిర్మించుకుంటే ఒక్కో షెడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 83 వేలు ఇస్తోంది. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా రూ. 22 లక్షల నిధులను లబ్ధిదారులకు మంజూరు చేశారు. కాగా, ఐదు మీటర్ల పొడవు 4 మీటర్ల వెడల్పుతో ఈ షెడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వ నిర్ణయించిన కొలతల ప్రకారమే కొట్టాల నిర్మాణాలు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. పశువుల షెడ్లు మంజూరు పట్ల పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పశువుల షెడ్డు నిర్మించుకున్న



ఉపాధి హామీ పథకం కింద నాకు పశువుల షెడ్డు మంజూరైంది. అధికారులు సూచించిన కొలతల ప్రకారం షెడ్డు నిర్మించాం. మా పశువులను కట్టివేసుకునేందుకు ఈ షెడ్డు ఉపయోగకరంగా ఉంటుంది. మాకు షెడ్డు మంజూరు కావడం సంతోషకరం. ఈ పథకంతో పేదలకు ఎంతో మేలు.

– మామిడి వెంకటలక్ష్మి, లబ్ధిదారురాలు, గరిడేపల్లి

158 పశువుల షెడ్లు మంజూరు



మండల వ్యాప్తంగా 158 పశువుల షెడ్లు మంజూరు అయ్యాయి. అందులో ఇప్పటికే 40 పశువుల షెడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారమే షెడ్లు నిర్మించాలి. నిబంధనల ప్రకారం హెడ్లు నిర్మించిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తున్నాం.

– ఆర్.సురేష్, ఏపీఓ, గరిడేపల్లి

పౌరులు చట్టానికి లోబడి నడుచుకోవాలి

- సూర్యాపేట ఎస్పీ నర్సింహ


కలకోవలో పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ నర్సింహ

మునగాల : పౌరులు చట్టానికి లోబడి నడుచుకోవాలని, క్షణికావేశం, సంతోషం కోసం నేరాలకు పాల్పడి జీవితాలను జైలుపాలు చేసుకోవద్దని జిల్లా ఎస్పీ కె.నరసింహ కోరారు. భాగంగా బుధవారం రాత్రి మండలంలోని కలకోవలో నిర్వహించిన పోలీస్ ప్రజాభరోసా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలీసులు ప్రజల భద్రత, రక్షణ కోసం పనిచేస్తున్నారని, పోలీసు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామానికి మంచిపేరు తేవడానికి ప్రతిఒక్కరూ మంచి నడవడిక కలిగి ఉండాలన్నారు. ప్రతి గ్రామచరిత్ర పోలీసు రికార్డులలో నమోదు చేయబడి ఉంటుందని, గ్రామంలో ఏమైన చెడు సంఘటనలు పోలీసు స్టేషన్‌లో నమోదైతే గ్రామం సమస్యాత్మక గ్రామంగా ఉంటుందని, తద్వార గ్రామాభివృద్ధి వెనుకబడుతుందన్నారు. సైబర్ నేరాలు, మోసాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు నిబంధనలు పాటించి జాగ్రత్తగా ప్రయాణం చేయాలన్నారు. గ్రామ రక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులు, యువత గంజాయి, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం గ్రామంలో ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు జూకూరి గుర్వయ్య, లక్ష్మయ్య,


కార్యక్రమానికి హాజరైన గ్రామస్తులు

గ్రూపు– 2లో ప్రతిభ కనబరిచి ర్యాంకు సాధించిన లక్ష్మణ్‌ను ఎస్పీ సత్కరించారు. అనంతరం ఎస్పీని గ్రామస్తులు సత్కరించారు. అనంతరం పోలీస్ కళాబృందం సామాజిక అంశాలపై పాటలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మునగాల సీఐ బి.రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, పార్టీల నాయకులు బుర్రి శ్రీరాములు, మండవ వెంకటాద్రి, కొంపెల్లి వీరబాబు, గన్నా నరసింహారావు, వెంకన్న, శ్రీను,శంకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్ట్ పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఆర్ట్ టీచర్, సిబ్బంది

హుజూర్‌నగర్ : ముంబయికి చెందిన ది డ్రీమ్ సంస్థ ఆధ్వర్యంలో గతేడాది డిసెంబర్‌లో వివిధ విభాగాల్లో నిర్వహించిన జాతీయ స్థాయి ఆర్ట్ పోటీ పరీక్షల్లో హుజూర్‌నగర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులతో పాటు పలువురు జాతీయ స్థాయి అవార్డులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ దున్న వెంకటేశ్వర్లు, ఆర్ట్ టీచర్ డాక్టర్ నాగజాను సూరేపల్లి తెలిపారు. ది డ్రీమ్ సంస్థ వెల్లడించిన ఫలితాల్లో తమ విద్యాలయం విద్యార్థులు జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు గురువారం వారు విలేకరులకు వెల్లడించారు. ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి వట్టిపు కార్తీక్‌కు డ్రాయింగ్ అండ్ పెయింటింగ్‌లో జాతీయ స్థాయి రెండో ర్యాంకు, 5వ తరగతి విద్యార్థి మచ్చ వరుణ్‌కు కొలాజ్ మేకింగ్‌లో మూడోవ ర్యాంకు, 8వ తరగతి విద్యార్థి పాతకొట్ల నీరజ్‌కు కొలాజ్ మేకింగ్‌లో నాలుగవ ర్యాంకు, 6వ తరగతి విద్యార్థి ఏ.ఈశ్వర్‌కు కలరింగ్‌లో నాలుగువ ర్యాంకు, 7వ తరగతి విద్యార్థి బి.శ్రీకాంత్ స్టార్ అవార్డు, 9వ తరగతి విద్యార్థి మహంకాళి భానుప్రకాష్‌కు క్రాఫ్ట్ మేకింగ్‌లో స్టార్ అవార్డు, చెడపంగు సాయినవీన్‌కు గోల్డ్ మెడల్స్ లభించినట్లు తెలిపారు. అన్ని విభాగాల్లో కలిపి మొత్తం 29 మంది గోల్డ్ మెడల్స్ సాధించారన్నారు. అంతేకాకుండా స్కూల్‌కు, ప్రిన్సిపాల్‌కు, ఆర్ట్ టీచర్‌ను జాతీయ స్థాయి అవార్డులు వరించాయి. ఈ సందర్భంగా డ్రీమ్ సంస్థ పంపిన ప్రశంసా పత్రాలను గురువారం విద్యాలయంలో విద్యార్థులకు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం


ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు


ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్


పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి

నేరేడుచర్ల : మండలంలోని మేడారం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం దేవతామూర్తుల విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి భక్తులు పోటెత్తారు. వేద పండితులు ఇరువంటి సరేంద్రశర్మ, శివకుమార్ శర్మ, వెంకటరమణశర్మ, సత్యనారాయణశర్మ, కిశోర్ శర్మలు వేద మంత్రాలతో గణపతి పూజ, పుణ్యావచనం అనంతరం విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. క్రేన్ల సహాయంతో ధ్వజస్తంభాన్ని నిలబెట్టారు. ధ్వజస్తంభం కింద భక్తులు రాగి, పగడం, ముత్యం, వనధాన్యాలు వేశారు. అనంతరం అర్చకులు స్వామివారి విగ్రహాలకు శాంతి కల్యాణం నిర్వహించారు. ఈ శాంతి కల్యాణానికి నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, పాలకీడు మాజీ ఎంపీపీ భుక్యా గోపాల్, డీసీసీబీ డైరెక్టర్ అప్పిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులకు సోమప్ప ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భూజంగరావు, కార్యదర్శి అరిబండి శ్రీరామయ్య, కోశాధికారి శ్రీనివాస్‌రావు, కట్ట రామారావు, కృష్ణారావు, అరిబండి చిన సీతయ్య, సత్యనారాయణ, భూషయ్య, సత్యనారాయణ, కిరణ్, వెంకటేశ్వర్లు, ప్రసాద్, మధు, రాకేష్, నరసయ్య, శ్రీనివాస్, యాదగిరి, రాజీవ్, తదితరులు ఉన్నారు.

ప్రకృతి పరిరక్షణతోనే మానవ మనుగడ


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజ్ అధికారి

మునగాల : ప్రకృతి పరిరక్షణతోనే మానవ మనుగడ ఉంటుందని, వృక్షాలు, వన్యప్రాణులను రక్షించుకోవాలని ఫారెస్ట్ రేంజ్ అధికారి ఆదిత్య అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో గురువారం యూత్ అండ్ ఎకో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'పర్యావరణ మార్పులు– పరిణామాలు'అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వాతావరణ మార్పులకు, అధిక ఉష్ణోగ్రతలు పెరగడానికి అడవులు తగ్గిపోవడమే ప్రధాన కారణమన్నారు. అడవుల రక్షణకు అధ్యాపకులు, విద్యార్థులు భాగస్వాములై ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్పించాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ బూర సైదయ్యగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ ఓరుగంటి రవి, ఎస్.రాధాకృష్ణ, సేంద్రియ వ్యవసాయ ప్రచారకులు మొలుగూరి గోపి, అధ్యాపకులు ఎస్.రామలింగాచారి, షేక్ షరీఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోండి


మునగాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీఓ రమేష్‌దీనదయాళ్

మునగాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్ కోరారు. గురువారం మునగాల ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. అర్హులు ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో లేదా మీ సేవా కేంద్రాల్లో ఈ నెల 14వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, పట్టాదారు పాసుపుస్తకం, వికలాంగులైతే సదరం సర్టిఫికెట్ జిరాక్స్ ప్రతులతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, వనరబుల్ సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు మాత్రమే స్వీకరించనున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక జిల్లా, మండల కమిటీల ద్వారా ఉంటుందని వివరించారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓ లావణ్యకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు, సీఐటీయూ నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామ పంచాయతీల్లో ఏళ్ల తరబడి నామమాత్రపు వేతనాలతో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. ఈమేరకు గురువారం ఆ సంఘం నాయకులు, కార్మికులతో కలిసి హుజూర్‌నగర్ ఎంపీడీఓ లావణ్యకు ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి 15 నెలలు గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం నేటికీ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్మికులకు రెగ్యులరైజ్ చేసి కనీస వేతనం ఇవ్వాలని కోరారు. పెండింగ్ జీతాలు అందజేయాలన్నారు. మల్టీపర్పస్ విధానం ఎత్తివేయాలన్నారు. కారోబార్, బిల్‌కలెక్టర్‌లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు షేక్ అసాన్‌మియా, వెంకటరెడ్డి, నాగరాజు, శ్రీను, గౌస్, నాగేశ్వరరావు, భూపాల్, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల రాకపోకలు నిలిపివేయాలని వినతి


ఎంపీడీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు

చిలుకూరు : మండల కేంద్రంలోని కాలువ ఒడ్డున గల శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి రామాపురం వెళ్లే రోడ్డులో ఏర్పాటు చేసిన డిజిల్ బంక్‌కు నిత్యం లారీల రాకపోకలతో రోడ్డు మొత్తం దెబ్బతిన్నదని, కావున లారీల రాకపోకలను నిలిపివేయాలని చిలుకూరు గ్రామానికి చెందిన పలువురు రైతులు కోరారు. ఈమేరకు గురువారం చిలుకూరు ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ ప్రతాప్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. లారీల రాకపోకలతో ఎస్ఎస్‌పీ 9– ఆర్ కాలువ పక్కన గల పొలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కొల్లు సత్యనారాయణ, మంకెన వెంకట్రావ్, కొడారు లక్ష్మీనారాయణ, రాయళ్ల వెంకటేశ్వర్లు, మంకెన రామారావు, పొందూరి నాగరాజు, శ్రీను, రోశయ్య, అప్పారావు, కొడారు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ధూళిపాల ధనుంజయనాయుడు

అనంతగిరి : అనంతగిరి మండల కేంద్రంలో ఈ నెల 12వ తేదీన నిర్వహించబోయే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాల్గవ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రెమిడాల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. గురువారం మండలంలోని శాంతినగర్‌లో నిర్వహించిన జిల్లా మహాసభల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు జీవిత భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కూలీలకు వేతనం రూ.7 మాత్రమే పెంచి వారిని అవమానానికి గురి చేసిందన్నారు. పార్లమెంటు సభ్యుల, మాజీ సభ్యుల జీతభత్యాలు రూ.వేలల్లో పెంచుతున్నారని, కానీ ఉపాధి కూలీలకు మాత్రం మొండి చేయి చూపిస్తున్నారని అన్నారు. జిల్లా మహాసభలకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బద్దం కృష్ణారెడ్డి, నీలం నాగభద్రం, మాజీ ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యులు షేక్ లాలు, పేరం నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి ఏర్పాట్లు


ముస్తాబైన పురాతన సీతారామమందిరం

కోదాడ : పట్టణం నడిబొడ్డున గల పురాతన సీతారామమందిరంలో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. బొడ్రాయి పక్కన గతంలో ఈ మండపం లేనప్పుడు పందిళ్లు వేసి కల్యాణం నిర్వహించేవారు. 1971లో ఇక్కడ కల్యాణ మండపం ఏర్పాటు చేసి కొన్నేళ్లు స్వామివారి కల్యాణం చేశారు. పట్టణం పెరగడం, కల్యాణ మండపం శిథిలావస్థకు చేరడంతో కొంతకాలంగా ఇక్కడ శ్రీరామనవమికి స్వామివారి కల్యాణం చేయడం లేదు. తాజాగా ఈ కల్యాణ మండపానికి మరమ్మతులు చేపట్టి, ఈ ఏడాది నుంచి మళ్లీ కల్యాణం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే శ్రీరామనవమి రోజు సాయికృష్ణ థియేటర్ రోడ్డులో ఉన్న కల్యాణ మండపంలో కోదాడ రామాలయ నిర్వాహకులు ఉదయం కల్యాణం నిర్వహించనుండగా, ఇక్కడ రాత్రి స్వామివారి కల్యాణం చేయడానికి నిర్ణయించినట్లు సీతారామ మిత్రమండలి సభ్యులు గుడుగుంట్ల శంకర్, మేళ్లచెరువు మధు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని, పీటల మీద కూర్చోవాలనుకున్న భక్తులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

వాగు పూడిక తీయించాలి

నడిగూడెం : మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ రాష్ట్ర నీటిపారుదల, సివిల్ సప్లై శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కోరారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి కార్యాలయంలో కోదాడ డివిజన్ స్థాయి అధికారులు, నాయకులతో మంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భారీ వర్షాలు కురిసిన సమయంలో నడిగూడెంలోని చౌదరి చెరువు నీరు గ్రామం మీదుగా ప్రవహిస్తోందని, కావున ప్రధాన వాగు పూడిక తీయించాలని ఆమె మంత్రిని కోరారు.

ఘనంగా అభినయ సాంస్కృతిక మహోత్సవం


సాంస్కృతిక ప్రదర్శనలో చిన్నారులు

కోదాడ : పట్టణంలోని తేజ టాలెంట్ పాఠశాలలో గురువారం అభినయ సాంస్కృతిక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నృత్య ప్రదర్శన నిర్వహించి ఆకట్టుకున్నారు. ప్రతిభచూపిన విద్యార్థులకు వైద్యులు ఏటుకూరి రామారావు, డాక్టర్ శ్రీనివాసరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్వామి వెంకటేశ్వర్లు, హెచ్ఎం అప్పారావు, పాఠశాల డైరెక్టర్ జానకి రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 30లోగా పన్ను చెల్లిస్తే 5శాతం మినహాయింపు

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట మున్సిపాలిటీలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను గృహ, వ్యాపార, వాణిజ్య యజమానులు ఏప్రిల్ 30లోగా పన్నులు చెల్లిస్తే 5శాతం మినహాయింపు ఉంటుందని మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి, అదనపు కలెక్టర్ పి.రాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదవకాశాన్ని గృహ, వ్యాపార, వాణిజ్య యజమానులు వినియోగించుకోవాలని కోరారు. బిల్ కలెక్టర్‌కు లేదా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లలో పన్నులు చెల్లించి 5శాతం మినహాయింపు పొందొచ్చని తెలిపారు.

విద్యార్థులకు అభినందన

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో ఇటీవల నిర్వహించిన ఒలింపియాడ్ పరీక్షల్లో రెండో లెవెల్‌లో విజయం సాధించిన విద్యార్థులను గురువారం హెచ్ఎం రమణారావు అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పానుగోడులో వైద్య శిబిరం


వైద్య శిబిరంలో లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రజలు

గరిడేపల్లి : మండలంలోని పానుగోడు గ్రామంలో నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 80 మందికి షుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అనంతరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి గుండ్రెడ్డి సైదిరెడ్డి, కందిబండ శ్రీనివాసరావు, కీత కనకయ్య, చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, బసవ కోటేశ్వరరావు, మలికంటి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో అన్నదానం

కోదాడరూరల్ : మండలంలోని నల్లబండగూడెం శివారులో గల సాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దాతలు ముంగి నరేష్, రజియా దంపతులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నల్లపాటి నర్సింహారావు, రిచిత్, లక్కి, ముత్తయ్య, రామనర్సమ్మ, రంగారావు, ఆదినారాయణ, పూర్ణ, సాయిశర్మ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు చెందిన తెల్లబోయిన వెంకన్నకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాయలంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సులువ చంద్రశేఖర్, రమేష్, నాగేంద్ర బాబు, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.